సాక్షి
ప్రకాశం

గురువారం, 16, అక్టోబర్, 2025



బస్సులు లేక అవస్థలు

ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటన నేపథ్యంలో జిల్లా నుంచి 160 బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. - 10లో..



నకిలీ మద్యంతో పేదల ప్రాణాలు బలి

నకిలీ మద్యంతో పేదల ప్రాణాలు బలవు తున్నాయని మాజీ మంత్రి సురేష్ అన్నారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
31 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం, ఆనందం

● డీఈఓ కిరణ్ కుమార్



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ కిరణ్ కుమార్

ఒంగోలు సబర్బన్: వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో బుధవారం నిర్వహించిన గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ, విజయవాణి చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా డీ వార్మింగ్ టాబ్లెట్లు వేసుకోవాల్సిన అవసరం రాదన్నారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అని గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాధాన్యతను వివరించారు. డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో స్టెప్ అండ్ యూత్ స్పోర్ట్స్ జిల్లా అధికారి శ్రీమన్నారాయణ, జిల్లా ఉమన్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ పాల్గొన్నారు.

రేపు మైనంపాడు హైస్కూల్లో హాకీ సెలక్షన్స్

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు హైస్కూల్లో ఈనెల 17వ తేదీ 69వ స్కూల్ గేమ్స్ హాకీ అండర్ 14, అండర్ 17 బాయ్స్ అండ్ గరల్స్ జిల్లా టీం సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ డాక్టర్ చెక్క వెంకటేశ్వర్లు, ఏ శిరీష కుమారి తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా, పర్యవేక్షకులుగా డీఈఓ ఏ కిరణ్ కుమార్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న హాకీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. అండర్ 17 లో పాల్గొనే ఇంటర్మీడియెట్ బాలబాలికలు టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో, పాన్ నంబర్, అపార్ ఐడీని ప్రిన్సిపల్‌తో అటెస్టేషన్ చేయించుకోవాలన్నారు.

ఆశల వల!



టెక్నాలజీ ఒక వైపు ఎన్నో సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. మరో వైపు పెరిగిపోతున్న సైబర్ నేరాలు సవాళ్లు విసురుతున్నాయి. డిజిటల్ అరెస్టులు.. ట్రెండింగ్ యాప్, డేటింగ్ యాప్ ఇలా రకరకాల మార్గాల్లో సైబర్ ముఠా రెచ్చిపోతోంది. ప్రజల బలహీనత, ఆశ, అవగాహన లేమిని సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మార్చుకొని అమాయకులకు వల విసురుతున్నారు. అమాయకుల కష్టార్జితాన్ని కొల్లగొట్టేస్తున్నారు. కనిగిరి పట్టణంలో ఇటీవల జరుగుతున్న నేరాలు పట్టణవాసుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. మోసపోయిన వారిలో విద్యావంతులు, వ్యాపారులు ఉండటం గమనార్హం.

- ● ఫోన్ వాట్సప్ మార్ఫింగ్ యాప్,
- ● డిజిటల్ అరెస్ట్..ట్రేడింగ్ యాప్‌ల ద్వారా మోసాలు
- ● వ్యాపారి వద్ద నుంచి రూ.1.16 కోట్లు స్వాహా
- ● బాధితులు అత్యధికులు విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు, వ్యాపారులే..
- ● ఆలస్యంగా వెలుగు చూస్తున్న ఘటనలు

కనిగిరిరూరల్: కనిగిరిలో సైబర్ మోసాల బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. డిజిటల్ అరెస్ట్ స్కాంలో పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇరుక్కుని రూ.35 లక్షలు నష్టపోయాడు. అలాగే పట్టణానికి చెందిన ఓ షోరూం వ్యాపారి ట్రేడింగ్ యాప్ రూ.1.16 కోట్లు కోల్పోయాడు. పట్టణంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ మోసాలు, నేరాలపై ఓ వైపు పోలీస్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాల చేపడుతూ అప్రమత్తం చేస్తున్నా ఏదో ఒక చోట బాధితులు వెలుగు చూస్తూనే ఉన్నారు. భయపడి కొందరు.. అవగాహన లేక మరికొందరు.. అత్యాశకు పోయి ఇంకొందరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని లక్షలు పోగొట్టుకొని విలవిల్లాడుతున్నారు.

కిలాడీ లేడీ ఉచ్చులో వ్యాపారి..

ఇటీవల పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి ట్రెండింగ్ యాప్ ద్వారా ఓ మహిళ పరిచయమైంది. అతన్ని మాయమాటలతో పడేసింది. ఆ తర్వాత లాభదాయక వ్యాపారం చేద్దామంటూ తొలుత రూ.50 వేలు పెట్టుబడి పెట్టించి ఒక్క రోజులోనే రూ.58 ఆదాయం వచ్చినట్లు చూపించింది. ఆ తర్వాత రూ.16 లక్షలు, మళ్లీ రూ.20 లక్షలు ఇలా మొత్తం 45 రోజుల్లో రూ.1.16 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించింది. తాను పెట్టుబడిగా పెట్టిన డబ్బులు ఇవ్వాలని అడగ్గా.. మరో రూ.80 లక్షలు పెడితే మొత్తం రూ.2 కోట్లు ఇస్తామని నమ్మబలికింది. అయితే సదరు వ్యాపారి ముందుగా తాను పెట్టిన పెట్టుబడి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో సదరు మహిళ ఫోన్, యాప్ నంబర్, తదితర ఐడీలను బ్లాక్ చేసింది. దీంతో తాను మోసపోయినట్లు ఆ వ్యాపారి తెలుసుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని, ఎవరికీ చెప్పవద్దని పోలీసులను కోరినట్లు సమాచారం. బాధితుడు మూడు అకౌంట్ల ద్వారా ఆ కిలాడీ లేడీకి సంబంధించిన 7 అకౌంట్లకు నగదును మొత్తాన్ని బదిలీ చేసినట్లు సమాచారం.

ఇటీవల కనిగిరిలో సైబర్ నేరాలు..

– ఈ ఏడాది ఫిబ్రవరిలో పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఎంఈఓ సైబర్ మోసగాళ్ల బారిన పడి రూ.35 లక్షలు నష్టపోయారు. సైబర్ నేరగాళ్లు తెలివిగా విశ్రాంత ఉద్యోగి పూర్తి వివరాలు, వారి కుటుంబ సభ్యుల పూర్తి డేటా సేకరించి మోసం చేశారు. ఉపాధ్యాయుని కుమారుడు సైబర్ నేరగాళ్ల మోసాన్ని గుర్తించి ఫోన్‌లో వార్నింగ్ ఇవ్వడంతో మోసగాళ్ల మిన్నకుండిపోయారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

■ అలాగే ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిని కూడా సైబర్ మోసగాళ్లు బెదిరించారు. ఇతర రాష్ట్రంలో ఉపాధ్యాయుడి ఆధార్ కార్డుపై పలు నేరాలు జరిగాయని, సుమారు రూ.2.50 కోట్లు బ్యాంకులకు మోసం చేశారని, మీపై మా రాష్ట్రంలో కేసు నమోదు చేసినట్లు బెదిరింపులకు దిగారు. తొలుత వాట్సప్ కాల్‌తో లైన్‌లోకి వచ్చిన ఆగంతకులు ఒక్కసారిగా వీడియో కాల్‌లోకి వచ్చి బెదిరింపులకు దిగారు. ఇంట్లోనే సుమారు 2.30 గంటల సేపు గదిలో నుంచి కదలనీయకుండా చేసి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. చివరకు పోలీస్ యూనిఫాంతో ఉన్న ఓ అధికారి లైన్‌లోకి వచ్చి 'మీరు మంచి వారిలాగా ఉన్నారని.. మేమూ ఉద్యోగలమేనని.. అర్జెంట్‌గా కొంత నగదు తాము చెప్పిన అకౌంట్‌లో వేస్తే మిమ్మల్ని సేవ్ చేస్తానంటూ' నమ్మబలికారు. దీంతో సదరు ఉపాధ్యాయుడు తన అకౌంట్లో ఉన్న రూ.57 వేలను ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత తేరుకుని సైబర్ క్రైం నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

■ అలాగే పట్టణానికి చెందిన ఇద్దరు టీచర్లకు తాము ఏసీబీ, ఇతర పోలీస్ శాఖల అధికారులమని చెప్పి ఫోన్ చేసి హిందీలో మాట్లాడటంతో వారు వెంటనే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో ఫోన్ కట్ చేసినట్లు గతంలో ప్రచారం జరిగింది.

■ ఏడాదిన్నర క్రితం కనిగిరిలో ఎంపీడీఓగా పని చేసి, ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగిగా ఉన్న అధికారికి సైబర్ నేరగాళ్లు ఫోన్ తాము ఏసీబీ నుంచి అంటూ బెదిరించారు. తొలి విడతగా కొంత నగదు చెల్లించిన ఆ అధికారి రెండో దఫాలో అప్రమత్తం కావడంతో సైబర్ నేరగాళ్లు మిన్నకుండిపోయారు.

■ పీసీపల్లి మండలంలో గతంలో పనిచేసిన ఓ ఎంపీడీఓకూ తాము విలేకర్లమని, నగదు ఇవ్వాలని సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మార్ఫింగ్ వీడియోతో మోసం

గతంలో సైబర్ కేటుగాళ్లు మార్ఫింగ్ వీడియోలతో పట్టణంలోని పలువురు ప్రముఖ వ్యక్తులను, వ్యాపారస్తులను, ప్రజా ప్రతినిధులను బెదిరింపులకు గురిచేసిన సంఘటనలూ ఉన్నాయి. కొందరు వారి ఉచ్చులో పడి రూ.లక్షలు మోసపోయారు. డబ్బులు ఇవ్వకపోతే వీడియో నెట్‌లో పెడతామని, వైరల్ చేస్తామని చెప్పి, బెదిరింపులకు దిగి నగదు గుంజినట్లు తెలిసింది. వెంటనే వారు పోలీసులను ఆశ్రయించారు. వారి సలహాల మేరకు సిమ్ కార్డ్‌లను తీసేశారు. ఇలా సైబర్ నేరగాళ్లు రకరకాలుగా మోసాలు చేస్తున్నారు.

ఆన్‌లైన్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



ఆన్‌లైన్, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు, నేరాలకు గురైన బాధితులు వెంటనే 112 ఫిర్యాదు చేయండి. cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలి. పొరపాటున ఆన్‌లైన్ మోసానికి గురై నగదు బదిలీ చేస్తే గంటలోపు 193 కాల్ చేస్తే ఆ ఖాతా నంబర్‌లో నగదును హోల్డ్ చేస్తారు. సైబర్ నేరాలు, మోసాలపై ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేశాం. ట్రెండింగ్ యాప్‌లో కనిగిరి వ్యాపారి రూ.1.16 కోట్లు మోసపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నాం.

– టి.శ్రీరాం, ఎస్సై, కనిగిరి

ప్రశ్నిస్తే..వేధింపులా

హక్కులకు పాతర

సాక్షి నెట్‌వర్క్: ప్రజాకంటక పాలనను నిగ్గదీస్తూ..మోసాలను ఎండగడుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. పత్రికాముఖంగా, సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన వారిపై పోలీసులను అడ్డుపెట్టుకుని వేధింపులకు పాల్పడుతోంది. తమకు జరుగుతున్న అన్యాయాలపై, ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 20 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు. మద్దిపాడు మండలంలో ప్రముఖ సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ సోషల్ మీడియా ద్వారా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై చేసిన కామెంట్స్ చేశారంటూ కేసు నమోదు చేశారు. వీరితో పాటు చిలకలూరిపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి, అన్నమయ్య జిల్లాకు చెందిన వర్రా రవీంద్రరెడ్డి, విశాఖపట్నానికి చెందిన ఇంటూరి రవికిరణ్‌లపై కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఒంగోలులో కేసులు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఇద్దరు సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలపై పోస్టులు పెట్టారంటూ పామూరులో కేసులు పెట్టారు. పులివెందులకు చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి పవన్ కళ్యాణ్ మీద సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టు పెట్టారని, బాపట్లకు చెందిన సయ్యద్ బాషా ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని ఒంగోలులో కేసులు నమోదు చేశారు. విద్యాశాఖలో ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియాలో పోస్టు చేశారంటూ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. రాష్ట్రాన్ని నకిలీ మద్యం పట్టి పీడిస్తున్నా.. అమాయకుల ప్రాణాలను హరిస్తున్నా చోద్యం చూస్తున్న సర్కారు క్షేత్ర స్థాయిలో వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు, పోలీసుల నోటీసులతో వేధింపులకు పాల్పడుతోంది. సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం, గంటల తరబడి ప్రశ్నలతో వేధించడంపై ప్రజాస్వామిక వాదులు, మేధావులు, సీనియర్ జర్నలిస్టులు మండిపడుతున్నారు.

పత్రికల మీద కేసులు రాజ్యాంగ విరుద్ధం



ప్రజాస్వామ్యానికి ప్రతికలు నాలుగో స్థంభంలాంటివి. రాజ్యాంగ పరిరక్షణలో కీలకపాత్ర మీడియాది. ప్రజాస్వామ్యం ప్రకారం తమ భావజాలాన్ని వ్యక్తం చేసే హక్కును రాజ్యాంగం మనకు కల్పించింది. ఏదైనా తప్పుంటే రాజ్యాంగం ప్రకారం తిప్పికొట్టే అవకాశం ఉంది. ఏదైనా తప్పురాస్తే విచారించి చర్యలు తీసుకోవచ్చు. అందుకు భిన్నంగా పత్రికల గొంతు నొక్కడం ఎవరు చేసినా ఖండనీయం. జర్నలిస్టుల మీద కేసులు పెట్టడం, వేధించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

– కంకణాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛ మీద దాడి సరికాదు



రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొని రావడాన్ని పాలకులు సహించలేకపోతున్నారు. కేవలం కొంతమందిని లక్ష్యం చేసుకొని కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో సాక్షాత్తు చీఫ్ ఎడిటర్ మీద కేసులు పెట్టడం, నోటీసులు ఇచ్చే సాకుతో ఇంటి వద్దకు వెళ్లి నానా హంగామా సృష్టించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యానికి ఇది హితకరం కూడా కాదు. ఇది కక్షసాధింపు ధోరణికి నిదర్శనంగా కనపడుతోంది. ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలి.

– ధర్నాసి హరిబాబు, న్యాయవాది, అడ్వొకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి, ఒంగోలు

జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడమే



జర్నలిస్టులపై దాడులు చేయటమంటే పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడమే. ఉన్నది ఉన్నట్లు నిజాలను వెలికి తీస్తున్న సాక్షి పత్రికలో వస్తున్న వాస్తవాలను జీర్ణించుకోలేక సాక్షి ఎడిటర్‌పై నోటీసులు పేరుతో పోలీసులు వేధించటం అంటే పత్రికా స్వేచ్ఛను వ్యతిరేకించటమే. ఇలాంటి సంస్కృతిని దూరంగా పెట్టాలి. అధికారంలో ఏ పార్టీ అయినా ఉండవచ్చు. కానీ పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రవర్తించాలి.

– డాక్టర్ టీ.జవహర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు

ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం సరికాదు



అన్యాయాలు, అక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నించే పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదు. ప్రజా సమస్యలను పత్రికల ద్వారా ప్రభుత్వానికి చేరవేసే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం హేయమైన చర్య. కోర్టులైనా చర్యలు తీసుకుని జర్నలిస్టుపై అక్రమ కేసులు నమోదు చేయకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉంది.

– ఇనుకొల్లు మాదిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు, మర్రిపూడి

పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే



పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పత్రికల్లో వచ్చిన వార్తలో వాస్తవం లేకపోతే, నిజం కాకపోతే, ఆ వార్తపై సంబంధిత వ్యక్తులు, సంస్థలు, అధికారులు ఖండన ఇవ్వవచ్చు. అంతేగానీ సోదాల పేరుతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదు.

– పందిటి మోహన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి

జర్నలిస్టులపై పోలీసుల వేధింపులు తగదు



ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజల కోసం పోరాటం చేస్తున్న జర్నలిస్టులను పోలీసులు వేధించడం, అక్రమ కేసులు బనాయించడం అన్యాయం. ఇటీవల కాలంలో సాక్షి ఎడిటర్ పై, ఇతర జర్నలిస్టులపై పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు దారుణంగా ఉంది.

– యస్.జయరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి

వేధింపులకు ప్రభుత్వం స్వస్తిపలకాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పత్రిక స్వేచ్ఛను హరిస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తున్న సాక్షి దినపత్రికపై కక్షపెంచుకొని ఆ పత్రిక ఎడిటర్, జర్నలిస్టులను తీవ్రంగా ఇబ్బంది పెట్టడం సరైనపద్ధతి కాదు. ఎడిటర్‌కు నోటీసులు అందజేసేందుకు హైదరాబాదులోని సాక్షి కార్యాలయానికి వెళ్లిన నెల్లూరు పోలీసులు గంటల తరబడి ప్రశ్నించడం శోచనీయం. ఇటువంటి పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తిపలకాలి. పత్రికల్లో వస్తున్న సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉంది.

– టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ సీనియర్ నాయకుడు, వైపాలెం

అక్రమ కేసులు పెట్టడం అన్యాయం



పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడం మంచి పద్ధతి కాదు. నిజాలు నిర్భయంగా చెప్పే సాక్షి పత్రిక ఎడిటర్, బ్యూరోల పై కేసులు పెట్టడం, సాక్షి కార్యాలయంలోకి చొరబడి విధులకు ఆటంకం కలిగించడం తగదు. జర్నలిస్టులను భయపెడితే నిజాలు ఎలా బయటకు వస్తాయి. అక్రమ కేసులు పెట్టడం అన్యాయం.

– జూపల్లి కోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు, దర్శి

క్లుప్తంగా

సాగర్ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి



మృతిచెందిన మెలిక ప్రసాద్

తాళ్లూరు: మండలంలోని వెలుగువారిపాలెం వద్ద సాగర్ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లిన పొదిలి మండలం కాటూరివారిపాలెం వాసి మెలిక ప్రసాద్(48) నీట మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. వల బయటకు లాగే క్రమంలో కాలుకు చుట్టుకోవడంతో పట్టుతప్పి నీటిలో పడిపోయిన ప్రసాద్ అదే ప్రదేశంలో పూడికలో కూరుకుపోయి మృతి చెందాడు. బంధువుల తోపాటు స్థానికులు కలిసి వలల సహాయంలో కాలువ నుంచి మృతదేహాన్ని బుధవారం వెలికి తీసి స్వగ్రామానికి తరలించారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. గ్రామ సర్పంచ్ ముచ్చుమారి కోటేశ్వరమ్మ బ్రహ్మారెడ్డి, వీఆర్వో చిన్నకృష్ణ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ భాస్కర్‌రావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

8వ పే కమిషన్‌ను నియమించాలి

- హెడ్ పోస్టాఫీసు ఎదుట ఉద్యోగుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న రమణారెడ్డి

మార్కాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల వ్యతిరేక విధానాలను విడనాడాలని, 8వ పే కమిషన్ సభ్యులను నియమించాలని రాష్ట్ర అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం సహాయ కార్యదర్శి ఎస్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మార్కాపురం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలిండియా జనరల్ సెక్రటరీ ఎస్ఎస్ మహదేవయ్యను ఉద్దేశపూర్వకంగా విధుల నుంచి తొలగించారని, ఆయనను మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఎన్ఎఫ్‌పీఈ కార్మిక సంస్థ గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.నారాయణరెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఎ.రవి, కార్తీక్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు సాయం



ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన కానిస్టేబుళ్ల ఎం.శ్రీనివాసరావు, డి.సుబ్బారావు కుటుంబ సభ్యులకు సహచర ఉద్యోగులు సాయం అందించారు. జిల్లాలోని కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఫండ్ సేకరించి ఒక్కో కుటుంబానికి రూ.74 వేల చొప్పున ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు చేతుల మీదుగా బుధవారం స్థానిక ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో అందజేశారు. సహృదయంతో సాటి ఉద్యోగుల కుటుంబాలకు చేయూతనివ్వాలన్న ఆలోచన చేసిన అసోసియేషన్ నాయకులకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం, ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బస్సులు లేక అవస్థలు

- ప్రధాని పర్యటన నేపథ్యంలో రాయలసీమ జిల్లాలకు బస్సుల కేటాయింపు
- జిల్లా నుంచి 160 బస్సులు తరలింపు



బస్సులు లేక ఖాళీగా ఉన్న మార్కాపురం బస్టాండు

రెండు గంటల నుంచి వేచివున్నా



కడప వెళ్లేందుకు మార్కాపురం బస్టాండులో రెండు గంటల నుంచి వేచి ఉన్నా బస్సు రాలేదు. మేము ఏడుగురం ఉన్నాం. సమయానికి బస్సులు లేకపోవడంతో బస్టాండులోనే ఉండి ఇబ్బందులు పడుతున్నాం.

– వెంకటేశ్వర్లు, ప్రయాణికుడు

మార్కాపురం: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న నంద్యాల జిల్లా శ్రీశైలం, కర్నూలులో జరిగే వివిధ కార్యక్రమాలకు హాజరవుతున్న నేపథ్యంలో జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, ఒంగోలు, కనిగిరి, పొదిలి డిపోల నుంచి సుమారు 160 బస్సులను నంద్యాల, కర్నూలు జిల్లాలకు పంపడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి పలువురు బస్టాండులకు రాగా బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా పలు బస్టాండుల్లో బస్సులు లేక ఖాళీగా కనిపించగా, ప్రయాణికులతో నిండిపోయాయి. అరకొరగా వచ్చే బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు సీట్ల కోసం యుద్ధమే చేయాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం వర్షం కురవడంతో అటు బయటకు రాలేక, ఇటు బస్టాండులో ఉండలేక మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లా పాపలు, లగేజీతో బస్టాండుకు వస్తే బస్సులు లేవు. ముఖ్యంగా మార్కాపురం నుంచి విజయవాడ, ఒంగోలు, కడవ, వినుకొండ, మాచర్ల, గిద్దలూరు తదితర ప్రాంతాలతో పాటు గ్రామాలకు వెళ్లే పలు సర్వీసులను తాత్కాలికంగా రద్దుచేసి రాయలసీమ జిల్లాలకు పంపారు. మార్కాపురం పట్టణానికి వచ్చేందుకు సమీప గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయించగా కంభం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, త్రిపురాంతకం, కొనకనమిట్ల, పొదిలి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సకాలంలో బస్సులు లేకపోవడంతో ఆటోల్లో లేదా కార్లు బాడుగకు మాట్లాడుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిద్దలూరు నుంచి 35, మార్కాపురం నుంచి 35, ఒంగోలు నుంచి 35, కనిగిరి నుంచి 35, పొదిలి నుంచి 20 బస్సులను కర్నూలు, నంద్యాల జిల్లాల తోపాటు రాయలసీమ జిల్లాలకు పంపారు. గురువారం కూడా ఇదే పరిస్థితి ఉండనుంది. దీంతో పలువురు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు.

సర్కారు గొప్పలు.. ప్రయాణికులకు తిప్పలు



పొదిలి డిపోలో బస్సు ఎక్కేందుకు ప్రయాసపడుతున్న ప్రయాణికులు

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి కర్నూలు పర్యటనకు జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, పొదిలి, మార్కాపురం, కనిగిరి డిపోల నుంచి 160 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఇందులో ఒంగోలు డిపోలో 74 పల్లెవెలుగు బస్సులుండగా ఏకంగా 40 బస్సులను కర్నూలు సభకు తరలించినట్లు సమాచారం. మంగళవారమే జిల్లా నుంచి బస్సులన్నీ వెళ్లిపోయాయి. తిరిగి 17వ తేదీ సాయంత్రం లేదా రాత్రికి గానీ బస్సులు జిల్లాకు చేరుకోవు. 18వ తేదీ నుంచి రోడ్డు మీదకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం మీద మూడు రోజుల పాటు జిల్లాలో సగం పల్లెవెలుగు బస్సులు కనిపించవు. మహిళలకు ఉచిత బస్సు పథకంలో ప్రధానంగా పల్లెవెలుగు బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు డిపోలో ఉన్న బస్సుల్లో సగం బస్సులను కర్నూలు సభకు తరలించడంతో మహిళా ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి. వందలాది గ్రామాలకు బస్సులు వెళ్లే అవకాశం లేదు కనుక ఆయా గ్రామాలకు చెందిన ప్రయాణికులు, మహిళలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. మహిళలకు ఉచిత బస్సులు ప్రారంభించినప్పటి నుంచి సభలు, సమావేశాలంటూ ఆర్టీసీ బస్సులను తరలించడం నిత్యకృత్యమైపోయిందని ఆర్టీసీ యూనియన్ నాయకులు విమర్శిస్తున్నారు.

నకిలీ మద్యంతో పేదల ప్రాణాలు బలి

- నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ చేయించాలి
- టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే నకిలీ మద్యం వ్యాపారం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్



నకిలీ మద్యం అమ్ముతున్నారంటూ ఆరోపిస్తున్న డాక్టర్ సురేష్

సింగరాయకొండ: నకిలీ, కల్తీ మద్యం వ్యాపారంతో పేద ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న దోషులను కఠినంగా శిక్షించి ప్రాణాలు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఈ అక్రమ వ్యాపారంపై సీబీఐతో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం కల్తీ మద్యం వ్యవహారంపై దోషులను కఠినంగా శిక్షించాలని ఎన్నికల హామీలో భాగంగా ప్రజలకు నాణ్యమైన మద్యం అందించాలని కోరుతూ మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కారు. ఈ సందర్భంగా పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి ప్రధాన రహదారి గుండా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లి అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్, సీఐ ఎం.శివకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ కల్తీ మద్యంపై ముఖ్యంగా 5 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. నకిలీ మద్యం గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాపులు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాపులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటి వరకు పత్రికల కథనాల ప్రకారం సుమారు 421 మందికి పైగా నకిలీ మద్యం కారణంగా మృత్యువాత పడ్డారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలను గుర్తించి అనర్హులను తొలగించాలన్నారు. మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకుని అమ్మకం వేళలు తగ్గించాలని కోరారు. బడులు, దేవాలయాలకు సమీపంలో, పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేసిన వైన్‌షాపులు, బార్ల లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశామన్నారు.

టీడీపీ కనుసన్నల్లో నకిలీ మద్యం వ్యాపారం:

రాష్ట్రంలో బట్టబయలైన నకిలీ మద్యం వ్యాపారం టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతుందని ఇందుకు పూర్తి ఆధారాలు బట్టబయలయ్యాయని డాక్టర్ సురేష్ ఆరోపించారు. నెల్లూరు, విజయవాడ, ఏలూరు, పాలకొల్లు, పరవాడ తదితర ప్రాంతాలలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బట్టబయలయ్యాయన్నారు. నకిలీ మద్యం వ్యవహారం తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, అతని బావమరిది గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, అనుచరుడు జనార్దనరావు కనుసన్నల్లో జరిగిందని వీరందరూ టీడీపీ వారే కదా అని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆఫ్రికాలో మద్యం డిస్టిలరీలు ఉన్నాయని జయచంద్రారెడ్డి తన ఎన్నికల అఫిడవిట్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సుమారు రూ.5,300 కోట్లు నకిలీ మద్యం వ్యాపారం ద్వారా దోచుకున్నారని ఇంతటి భారీ అక్రమ వ్యాపారం బట్టబయలు చేసి దోషులకు శిక్ష పడాలంటే రాష్ట్ర ప్రభుత్వ చెప్పుచేతల్లో ఉండే సిట్ కాదని, సీబీఐ చేత దర్యాప్తు చేయించాలని సురేష్ డిమాండ్ చేశారు.

పార్టీ సీఈసీ సభ్యుడు డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు ఇస్తానని ప్రజలను మభ్యపెట్టిందని ఈరోజు నకిలీ మద్యాన్ని ప్రజలకు అందిస్తూ వారి ప్రాణాలను హరించిందని, ఇందుకు ముమ్మాటికీ టీడీపీ నాయకులే కారకులని విమర్శించారు. ర్యాలీ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వై వెంకటేశ్వరరావు, ఎస్ఈసీ సభ్యుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, మాకినేని వెంకట్రావు, కనపర్తి శేషారెడ్డి, తానికొండ రామచంద్రరావు, రాపూరి ప్రభావతి, షేక్ సుల్తాన్, పఠాన్ రియాజ్, చొప్పర వెంకన్న, కనపర్తి గోవిందమ్మ, యనమల మాధవి, చుక్కా కిరణ్‌కుమార్, దాసు శ్రీను, షేక్ కరీం, గొల్లపోతు గోవర్దన్, మిరియం సుధాకర్, గాదంశెట్టి గుప్తా, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, కోమిట్ల వెంకారెడ్డి, నరేష్, షేక్ అల్లాభక్షు, నాగార్జున, భాను, నవీన్‌రెడ్డి, బుజ్జమ్మ, చిడిపూడి కృష్ణారెడ్డి, చిమట శ్రీను, చామల ఉదయశంకరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, దేవరపల్లి వరుణ్, బత్తిన మనోహర్‌రావు, దగ్గుమాటి శంకరరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, ముప్పా కోటేశ్వరరావు, మారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, టి రవీంద్రరెడ్డి, వై వీర వసంతరావు, పూనూరి సంజీవరెడ్డి, సోమిశెట్టి సురేష్, బల్లెల ప్రభాకరరెడ్డి, కేశవరపు కృష్ణారెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి, కాళహస్తి వెంకారెడ్డి, పురిణి దేవ, గాలి బుజ్జి, దాసరిశేషయ్య, సాయికోటి, మాదాల శంకర్, అంకయ్య, కాకి జయపాల్, వాయిల పున్నయ్య, శివారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చచ్చినా చావే..!



గుండ్లకమ్మ వాగులో నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



వాగులో గుండా తంటాలు పడుతూ వెళ్తున్న మృతుడి బంధువులు

కంభం: మండలంలోని రావిపాడు గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తున్న సమయంలో ఊర్లో ఎవరైనా చనిపోతే నడుముల లోతుకు పైగా నీటిలో అడుగులో అడుగేస్తూ పాడె మోయాల్సిన దుస్థితి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తోంది. గ్రామానికి చెందిన అంజిరెడ్డి(54) బుధవారం మృతి చెందారు. శ్మశానానికి వెళ్లే మార్గంలో గుండ్లకమ్మ వాగులో నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు మృతుడి బంధువులు, గ్రామస్తులు అష్టకష్టాలు పడ్డారు. వాగు అవతల ఉన్న పంటపొలాలకు వెళ్లడానికి కూడా తిప్పలు తప్పడం లేదని, అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న జీవీ నరసయ్య

మార్కాపురం: ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై దీపావళి పండగలోగా జీవో విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగుల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య హెచ్చరించారు. బుధవారం మార్కాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పదోన్నతులకు సంబంధించి ఈ ఏడాది ఆగస్టు 28న ముఖ్యమంత్రి, రవాణాశాఖ మంత్రి అనుమతి ఇచ్చినప్పటికీ జీఏడీ విభాగంలో పెండింగ్ పెట్టి ఇంతవరకూ జీఓ విడుదల చేయలేదన్నారు. దీంతో పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న సుమారు 6 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారని చెప్పారు. ఈ సమస్యను దీపావళిలోగా పరిష్కరించకుంటే ఉద్యమమే శరణ్యమని హెచ్చరించారు. అనంతరం మార్కాపురం ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద నూతనంగా నిర్మించిన ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చక్రపాణి, ఎస్‌వీఎస్ శాస్త్రి, బీబీ వెంకటేశ్వర్లు, సీహెచ్ జనార్దన్‌రావు, పి.శేఖర్‌నాయుడు, బాషా హుస్సేన్, మంగమ్మ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు కూటమి సర్కారు సమాధి

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అందులో భాగమే..
- ప్రజా సమస్యలు గాలికొదిలేసి దోపిడీకి తెరలేపారు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల, మాజీ ఎమ్మెల్యే అన్నా ధ్వజం
- కూటమి సర్కారు పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పొదిలిలో కోటి సంతకాల సేకరణ



పొదిలిలో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న బత్తుల, అన్నా రాంబాబు



ఉప్పలపాడులో సంతకాల సేకరణలో పార్టీ నేతలు

పొదిలి రూరల్:

సామాన్యులు, పేదలకు వైద్యం, వైద్య విద్య అందకూడదనే దురుద్దేశం, అనుచరులకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెట్టే దుర్మార్గపు ఆలోచనలతో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడె బత్తుల బ్రహ్మానందరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని బుధవారం పొదిలి, ఉప్పలపాడు గ్రామాల్లో ప్రారంభించారు. పొదిలి విశ్వనాథపురంలో పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసులురెడ్డి, ఉప్పలపాడులో మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డితో కలిసి సర్కారు తీరుకు నిరసనగా సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. కోటి సంతకాల సేకరణ సమావేశాల్లో బత్తుల, అన్నా మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏకంగా 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో ఇప్పటికే 7 కాలేజీలు ప్రారంభం కాగా, మరో 10 కాలేజీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. కూటమి గద్దెనెక్కిన తర్వాత వైద్య కళాశాలలను సమాధి చేసేందుకు కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. దాదాపు రూ.లక్ష కోట్లు విలువ చేసే ప్రభుత్వ వైద్య కళాశాలలను, వేలాది ఎకరాల భూములను సీఎం చంద్రబాబు తన అనుచరులకు కట్టబెట్టేందుకు పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. చంద్రబాబు చీకటి బాగోతాన్ని బట్టబయలు చేసేందుకు, వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో రాష్ట్ర ప్రజలకు కలిగే నష్టం, ఇబ్బందులను వివరించేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, నాయకులు గొలమారి చెన్నారెడ్డి, సాయి రాజేశ్వరరావు, కె నరసింహారావు, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, నూర్జహాన్ బేగం, గౌసియా బేగం, యక్కలి శేషగిరిరావు, మస్తాన్‌వలి, ఫిరోజ్, వెంకటేశ్వరరెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటన

- శ్రీశైలం వచ్చి వెళ్లే వాహనాలు ముమ్మరంగా తనిఖీ
- భద్రతా చర్యలను పర్యవేక్షించిన మార్కాపురం డీఎస్పీ
- గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇతర వాహనాల నిలిపివేత



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ నాగరాజు

పెద్దదోర్నాల: నేడు శ్రీశైల పుణ్యక్షేత్రానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేట్టారు. గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు బుధవారం శ్రీశైలం ఘాట్‌రోడ్డులో అడుగడుగునా తనిఖీ చేశారు. బందోబస్తుకు హాజరైన పోలీసు సిబ్బందికి ముందుగా పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్ వద్ద మార్కాపురం డీఎస్పీ నాగరాజు దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, శ్రీశైలం నుంచి వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. లైసెన్స్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, మద్యం తాగిన వాహనదారులను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులోకి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇతర వాహనాలను అనుమతించేది లేదని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, పలువురు ఎస్సైలు ఉన్నారు.

పీపీపీ ఓ దండగమారి విధానం

- మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టొద్దు
- ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుంచి రుణాలు మంజూరు చేయాలి
- దళిత హక్కుల పోరాట సంఘం నేతల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి సర్కారు తెరపైకి తెచ్చిన పీపీపీ విధానం ఓ దండగమారి పంచాయితీ అని, తక్షణమే పీపీపీ మోడల్‌ను ఉపసంహరించుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఒంగోలులోని కలెక్టరేట్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ సంక్షేమంపై ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచారని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మాల కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు, మాదిగ కార్పొరేషన్‌కు రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారే కానీ 16 నెలలుగా ఒక్క రూపాయి కూడా అర్హులకు అందించలేదని దుయ్యబట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.వేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యాక్షన్ ప్లాన్ ప్రకటించి ఆరు నెలలైనా ఒక్క రూపాయి నిధులివ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీ జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులైనా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అబ్రహాము, జాన్ వెస్లీ, యేసు దాస్, ధనరాజ్, జిలాని, బ్రహ్మ, సామేలు, మోషే, మరియమ్మ, శాంతి, విజయలక్ష్మి, మనోహర్, కావేరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.